క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు అందిస్తున్నారు. ఆదివారం నంద్యాల జిల్లా బండిఆత్మకూరుకు చెందిన నడిపి వెంకటలక్ష్మమ్మ తన భర్త టూరిస్టు పుల్లయ్య జ్ఞాపకార్థం కుమారుడు శివయ్యతో కలిసి ఆలయ మహాప్రాకారానికి రూ. 1 లక్ష విరాళంగా అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కంపమల్ల నారాయణస్వామి వారికి తీర్థ ప్రసాదాలు అందించి ప్రత్యేక పూజలు చేయించారు.

నేడు పోలకల్‌లో మహా రథోత్సవం



పోలకల్లో శ్రీ చెన్నసోమేశ్వరస్వామి ప్రభను సిద్ధం చేసిన నిర్వాహకులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో చెన్నసోమేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా రథోత్సవం నిర్వహించనున్నారు.కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు పూజలు చేయనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మహా రథోత్సవం సందర్భంగా రాత్రి 9 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



దిన్నెదేవరపాడులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ఎలాంటి చిన్న జబ్బు చేసినా వెంటనే వైద్యులను సంప్రదించాలని మండల మాజీ ఉపాధ్యక్షుడు ధర్మవరం వాసు అన్నారు. ఆదివారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో కర్నూలు అమీలియో హాస్పిటల్ వైద్యులతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు పలు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

దిన్నెదేవరపాడులో ..

దిన్నెదేవరపాడులోని మారెమ్మ గుడి వద్ద ఆదివారం హీల్ అండ్ హెల్త్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

భోగేశ్వరంలో వైభవంగా పదహారు రోజుల వేడుక



భోగేశ్వరంలో రథాన్ని రథమండపంలోకి లాగుతున్న ధర్మకర్తలు

గడివేముల: భోగేశ్వరాలయంలో పదహారు రోజుల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన పదహారు రోజులకు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో స్వామికి వేదపండితులు,అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. చండీశ్వరుడు, త్రిశూలదేవత అధ్వర్యంలో అంకురార్పణ చేసిన వాటికి ఉద్వాసన పలుకుతూ కోనేరులో కలిపారు.అనంతరం రథం వద్దకు చేరుకొని వివిధ ద్రవ్యాధిపూజలు నిర్వహించి రథాన్ని భక్తుల మధ్య రథమండపంలోకి చేర్చారు. ఈ పూజ కార్యక్రమాల్లో చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, భక్తులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాను ఆదివారం జిల్లా జడ్జి పి.జె.సుధ దర్శించుకున్నారు. ఈమెకు దర్గా ధర్మకర్త మున్నపాషా చిష్తి స్వాగతం పలికి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అనంతరం జడ్జిని సత్కరించారు. దర్గా అభివృద్ధి, చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. దర్గాలో హిందూ ముస్లింలు అనే బేధ భావన లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండటం అద్భుతమన్నారు. సేవల్ని ఇలాగే కొనసాగించాలని ధర్మకర్తను కోరారు.

స్వచ్ఛతకు పెద్దపీట

- సచివాలయాల దగ్గర సీఎస్‌ల ఏర్పాటు
- శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు
- ఇప్పటికే 9 చోట్ల పనులు పూర్తి



చిన్నటేకూరు సచివాలయం దగ్గర నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్, డ్రైడే, వంటి కార్యక్రమాలు చేపడుతోంది. పారిశుద్ధ్య సిబ్బందితో ఉదయాన్నే ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేయిస్తోంది. అలాగే బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆరుబయట మల,మూత్ర విసర్జన చేయకుండా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సీఎస్‌సీ)లను నిర్మిస్తోంది. గ్రామ స్వరాజ్యంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయల వద్ద సైతం వాటిని ఏర్పాటు చేస్తుంది. సచివాలయ ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం అక్కడికి వచ్చే ప్రజలు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడకుండా సీఎస్‌సీల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. కల్లూరు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 15 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఒక్కో సీఎస్‌సీని రూ. 3 లక్షలతో నిర్మిస్తుంది. ఇందులో మహిళలు, పురుషులకు వేర్వేరు బాత్‌రూంలు ఏర్పాటు చేస్తుంది. మండలంలో ఇప్పటికే 9 సచివాలయాల వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు పూర్తికాగా మరో ఆరు చోట నిర్మాణ పనులు సాగుతున్నట్లు కల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

పసుపుపై దుంపకుళ్ల ప్రభావం



పాణ్యం సమీపంలోని తండాలో పసుపు కొమ్ములను ఉడకబెడుతున్న దృశ్యం

- తగ్గిన పంట దిగుబడి
- పెరిగిన పెట్టుబడి
- ఆందోళనలో పసుపు రైతులు



పసుపు కొమ్ములను ఆరబెట్టిన దృశ్యం

పాణ్యం: పసుపు పంట దిగుబడులపై దుంపకుళ్ల తెగులు తీవ్ర ప్రభావం చూపింది. ఎన్నో ఆశలతో పంట సాగు చేసిన రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి పరిస్థితి నెలకొంది. పాణ్యమండలంలో 20 ఎకరాలు, గడివేములలో 10, ఓర్వకల్లులో 40 ఎకరాల్లో పసుసు పంట సాగైంది. పంట సమయ కాలం 11 నెలలుగా కాగా ఓ రకం పంట 9వ నెల నుంచే దిగుబడి ఇస్తుంది. అయితే, ఈ సారి పంటకు దుంపకుళ్ల తెగులు సోకడంతో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లకు మించి దిగుబడి రాని పరిస్థితి. ఈ తెగులు సోకకపోతే 40 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు కూడా పెరిగాయి. ఎకరాకు రూ. లక్ష వరకు రైతులకు ఖర్చు వచ్చింది. మార్కెట్‌లో ధర చూస్తే ఆశించిన మేర లేదు. క్వింటం రూ. 5 వేలు పలుకుతుంది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావాని రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, పంటకు దుంపతెగులు ఆశించడం ఈ నష్టానికి ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి పెరిగింది



సాధారణంగా ఎకరానికి గతంలో రూ.50–60 వేలు పెట్టుబడి వచ్చేది. ఈ ఏడాది దుంపకుళ్ల తెగులు సోకడంతో దాని నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులకు ఖర్చు పెరిగింది. ఎకరానికి రూ.1లక్ష వరకు వచ్చింది. అయితే, ఆ మేర దిగుబడులు పెరగలేదు. నాకు ఎకరానికి 20–30 క్వింటాళ్ల (పచ్చిదుంపలు) వరకు వచ్చింది. వీటిని ఉడకబెడితే మరింత బరువు తగ్గుతుంది. మార్కెట్‌లో పసుపు ధర కూడా ఆశించిన మేర లేదు.

–చంద్రానాయక్ , కేఆర్‌ఆర్ తండా

సీపీఆర్‌తో మరణాలు తగ్గించవచ్చు



డాక్టర్ వసంతకుమార్‌ను సన్మానిస్తున్న కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): అకస్మాత్తుగా వచ్చే గుండె పోటు మరణాలను సీపీఆర్ చేయడం ద్వారా తగ్గించవచ్చని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో 'సడెన్ కార్డియాక్ అరెస్ట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ విషయమై డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ మన గుండె నిత్యం 60మైళ్ల పొడవుండే రక్తనాళాల ద్వారా అన్ని అవయవాలకు రక్తం పంప్ చేస్తూ ఉంటుందన్నారు. గుండెలో ఏర్పడ్డ బ్లాక్‌లు, విద్యుత్ షాక్‌ల కారణంగా గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ రావడంతో గుండె, మెదడుకు రక్తసరఫరా ఆగిపోతుందన్నారు. ఇలాంటి సమయంలో ఛాతిపై సీపీఆర్ చేస్తే మెదడుకు రక్తసరఫరా పునరుద్ధరించబడి కోలుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి సమాజంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై శిక్షణ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, వెంకటరాముడు, లక్ష్మన్న తదితరులు ఘనంగా సన్మానించారు.

గోరంట్ల మాధవుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీమాధవస్వామి

కోడుమూరు రూరల్: గోరంట్లలో శ్రీలక్ష్మీమాధవ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 12రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగిసే వారకు స్వామిని రోజుకో వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు.

నేడు ధ్వజారోహణం

బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం, రాత్రి బేరిపూజ సింహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఇందుకు దేవదాయ శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆదివారం నీట్ పీజీ పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్స్ జయచంద్ర ప్రసాద్, సుబ్రమణ్యం తెలిపారు. ఆర్‌జీఎంలో మొత్తం 272 మంది విద్యార్థులకు గాను 37మంది, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో 100 మందికి గాను 15 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు. పరీక్ష సందర్భంగా ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

కోలుకోలేక రైల్వే ఉద్యోగి మృతి

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామానికి చెందిన పాల్(24) అనే రైల్వే గాడ్ కోలుకోలేక మృతి చెందాడు. ఈయన కడుపు నొప్పి తాళలేక గతనెలలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే, కోలుకోలేక ఆదివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి విజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో ప్రతిసోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన ఎంఈఓ జ్యోతి సూచించారు ముడుచుకుపోయిన కాళ్లు, చేతులకు బాల్, ప్యాడ్స్‌పై వైద్యులు వ్యాయామం చేయిస్తారన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, బధిరులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యనందిస్తారని తెలిపారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంటి నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం 1,150 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

క్రికెట్ లీగ్ విజేత గణేష్ జట్టు



బంగారుపేట ప్రీమియర్ క్రికెట్ లీగ్‌లో విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ వాసు, దోన పాటి ఎల్లారెడ్డి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న బంగారుపేట ప్రీమియర్ క్రికెట్ లీగ్ విజేతగా గణేష్ టీమ్ నిలిచింది. కర్నూలు బళ్లారి దుర్గామాత జాతర మహోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మొత్తం 22 టీములు పాల్గొన్నాయి. పోటీల్లో విన్నర్స్‌గా గణేష్ టీమ్, రన్నర్స్‌గా మ్యాడ్ మాక్స్ టీమ్, మూడో స్థానంలో నందికొట్కూరు జట్టు నిలిచాయి. ఆయా జట్లకు అతిథులు డాక్టర్ వాసురెడ్డి, దోనపాటి ఎల్లా రెడ్డి, శ్రీనివాసరెడ్డిలు వరుసగా రూ.30 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహక నగదుతో పాటు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ బంగారుపేట యువత ముందుకు వచ్చి క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. షికారీలలో మార్పు తెచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్రికెట్ లీగ్ నిర్వాహకులు ఎస్.సురేష్‌బాబు, ఎస్. శేఖర్, ఫ్లవర్ డెకరేటర్ శివ, హాకీ శివ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో మంచు మనోజ్ సందడి



ఎస్వీ సుబ్బారెడ్డి ఆశీస్సుల కోసం కర్నూలు వచ్చిన మంచు మనోజ్, భూమా మౌనికారెడ్డి

కర్నూలు కల్చరల్: నూతన వధూవరులు మంచు మనోజ్, భూమా మౌనికా రెడ్డిలు ఆదివారం కర్నూలు నగరానికి వచ్చారు. హైదరాబాద్ నుంచి ఆళ్లగడ్డకు వెళుతూ కర్నూలు గిప్సన్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి స్వగృహానికి వచ్చారు. మౌనికా రెడ్డి తాత మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి, మేన మామ ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరిల ఆశీస్సులు అందుకున్నారు. వరుడు, సినీ హీరో మనోజ్ రాకతో సందడి నెలకొంది. మంచు, భూమా, ఎస్వీ ఫ్యామిలీ అభిమానులు అధిక సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. అనంతరం నూతన వధూవరులు ఆళ్లగడ్డకు వెళ్లారు.

9 నుంచి దశల వారీగా ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే మార్చి 9 నుంచి దశల వారీగా ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ చేబ్రోలు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం కర్నూలు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ హాజరై మాట్లాడారు. ముఖంగా పీఆర్‌సీ పెండింగ్ బకాయిలు, డీఏలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీపీఎఫ్ నిధులు, ఆరోగ్య కార్డుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అయితే దాదాపు మూడున్నరేళ్ల గడిచినా అధికారులుగాని, ప్రభుత్వంగాని స్పందించలేదన్నారు. ఈక్రమంలో ఉద్యోగులుగా ఉద్యమానికి వెళ్లాల్సిన బాధ్యతపై తమ ఉందన్నారు. ఉద్యోగులందరూ ఐకమత్యంతో ప్రభుత్వంపై పోరుకు తమతో కలసి రావాలన్నారు.

నాటిన మొక్కలను కాపాడుకుందాం



జగన్నాథగట్టుపై నాటిన మొక్కలకు నీళ్లు పోస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై నాటిన మొక్కలను కాపాడటంపై అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు శ్రీకారం చుట్టారు. ఏడాది కాలంగా జగన్నాథగట్టుపై పచ్చదనం అభివృద్ధి కోసం మొక్కలను పెద్ద ఎత్తున నాటారు. ప్రస్తుతం వేసవిలో ఎండల తీవ్రతకు మొక్కలు ఎండపోకుండా కాపాడేందుకు వాటిని నాటిన వారే నడుం బిగించారు. ఆదివారం సెలవు కావడంతో పలువురు ఉద్యోగులు, విశ్రాంత అధికారులు, విద్యార్థులు మొక్కలకు బిందెలతో నీళ్లు పోశారు. వారం, వారం నీళ్లు పోసి మొక్కలను కాపాడాలని నిర్ణయించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎఫ్‌వో బి.జయచంద్రారెడ్డి, పెద్దటేకూరుకు చెందిన వర్మీ కంపోస్ట్ యూనిట్ నిర్వాహకులు హరికృష్ణ, పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికి ఎనిమిదేళ్లు.. ఎన్నికలకు ఇంకెన్నేళ్లు!

ప్రసిద్ధ షాహీ జామియా మసీదు ప్రతిష్ఠకు భంగం కలుగుతోంది. క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించి.. ఏళ్లనాటి వైభవాన్ని చాటిచెప్పాల్సిన మసీదు కమిటీ సొంత ఎజెండాతో ముందుకు సాగుతోంది. నిస్వార్థ సేవను పక్కనపెట్టి.. రాజకీయాలకు చోటు కల్పించడంతో నిధుల గోల్ మాల్ చోటు చేసుకుంటోంది. మసీదు ఖాతాలో చేరాల్సిన ఆదాయం కాస్తా.. నిర్వాహకుల జేబుల్లోకి వెళ్తోంది. ఇదే సమయంలో మసీదు దుకాణాలనే నమ్ముకుని వ్యాపారాలు సాగిస్తున్న యజమానులను అనధికార కమిటీ గందరగోళానికి గురిచేస్తోంది. ఇకనైనా అవాంతరాలను సమష్టి నిర్ణయంతో అధిగమించి ఎన్నికలకు మార్గం సుగమమం చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాజకీయ చట్రంలో 'పెద్ద మసీదు'

- ఎన్నికలకు పూర్వ ముతవల్లీలు అడ్డు
- అమలుకు నోచుకోని కోర్టు ఆదేశాలు
- మీనమేషాలు లెక్కిస్తున్న వక్ఫ్‌బోర్డు
- నిధులు పక్కదారిపడుతున్నాయనే ఆరోపణలు



ఆదోనిలోని జామియా మసీదు

ఆదోని రూరల్: పట్టణంలోని షాహీ జామియా మసీదు(పెద్ద మసీదు) దక్షిణ భారతదేశంలోనే పేరు కలిగిన మసీదుల్లో ఒకటి. ఈ మసీదును సిద్ధిసూద్‌ఖాన్ నిర్మించాడు. 1921 మార్చి 21న మొట్టమొదటిసారిగా మసీదుకు ఎన్నికలు నిర్వహించారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2014లో డబ్ల్యూపీ నంబర్ 336/214 ద్వారా హైకోర్టు వక్ఫ్‌బోర్డుకు షాహీజామియా మసీదుకు ఎన్నికలు జరపాలంటూ ఆదేశాలు జారీ చేసింది. 2015 మే 3వ తేదీన వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో మసీదుకు ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో గుజిరిరావూఫ్, షాషావలి, సయ్యద్‌జాహిద్‌అన్వర్, కల్నల్ రహంతుల్లా, మస్తాన్‌వలీలు ముతవల్లీలుగా గెలుపొందారు. అయితే ఈ ఎన్నికలు ఆదోని షాహిజామియా మసీదు బైలా ప్రకారం కోర్టు నిర్ణయించిన మేరకు జరగలేదంటూ పూర్వ ముతవల్లీలు కె.ఎజాజ్‌అహ్మద్, ఆర్.సల్లావుద్దీన్‌లు కోర్టుకెక్కారు. కేసును విచారించిన ధర్మాసనం ఎన్నికలు బైలా ప్రకారం జరగకపోవడంతో మళ్లీ నిర్వహించాలని వక్ఫ్‌బోర్డును ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అప్పటి ట్రస్టీ కల్నల్ రహంతుల్లా మరో కేసు దాఖలు చేశారు. దీనిని కూడా విచారించిన ధర్మాసనం కేసును కొట్టేస్తూ వక్ఫ్‌బోర్డు లా ఆఫీసర్ పర్యవేక్షణలో ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇప్పటికి ఐదేళ్లు దాటినా ఎన్నికల ఊసే లేకపోవడం గమనార్హం.

లెక్కలు చెప్పాల్సి వస్తుందని..

గతంలో జరిగిన ఎన్నికల్లో ఐదుగురు ముతవల్లీల్లో ముగ్గురు చనిపోగా.. ప్రస్తుతం ఉన్న ఇద్దరిలో టీడీపీ మద్దతు ముతవల్లీ గుజిరి రావూఫ్ వక్ఫ్‌బోర్డు అధికారులతో కుమ్మక్కు అయ్యారనే చర్చ జరుగుతోంది. మసీదుకు ప్రతినెలా దాదాపు రూ.3లక్షల ఆదాయానికి లెక్కలు చూపాల్సి వస్తుందనే ఎన్నికలకు అడ్డు పడుతున్నారని సమాచారం. వాస్తవానికి మసీదుకు వచ్చే ఆదాయాన్ని సంబంధిత ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే గత ఎనిమిదేళ్లుగా మసీదు ఖాతాలో ఎలాంటి నిధులు జమ చేయడం లేదని తెలుస్తోంది.

ముందుగా ఎన్నికలు నిర్వహించాలి



షాహీజామియా మసీదుకు చెందిన దుకాణాన్ని కొన్నేళ్లుగా బాడుగకు నిర్వహిస్తున్నా. ప్రస్తుత ముతవల్లీల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. మసీదు కమిటీ బైలా ప్రకారం ఏమి చేయాలన్నా ఐదుగురు ముతవల్లీలు మెజారిటీ నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే అది చెల్లుబాటు అవుతుంది. రద్దయిన పాలకవర్గం 33 శాతం బాడుగలను పెంచుతామని ప్రకటించారు. ఇది ఎంతమాత్రం సమంజసం. ముందుగా ఎన్నికలు నిర్వహించిన తర్వాతే ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవాలి. – దార్వాడ్ రసూల్‌సాబ్, దుకాణదారు

మసీదు పరిధిలోని మొత్తం దుకాణాలు: 200	
ప్రతినెలా బాడుగలు:	రూ.3లక్షలు
ప్రతినెలా వ్యయం:	రూ.2.50 లక్షలు
ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన సభ్యులు: 6.413	

అనధికార పెత్తనం



2015లో బైలా ప్రకారం ఎన్నికలు నిర్వహించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాం. కోర్టు ఆ ఎన్నికను రద్దు చేసింది. అప్పటి నుంచి ఎన్నికల నిర్వహణ విషయంలో వక్ఫ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడున్న ముతవల్లీల్లో ముగ్గురు చనిపోగా, మిగిలిన ఇద్దరు అనధికారికంగా పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రతినెలా మసీదుకు సమకూరుతున్న ఆదాయాన్ని కూడా ఇళ్లకు తీసుకెళ్తున్నారు.

– కె.ఎం.జుబేర్ అహ్మద్, మాజీ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ

స్టే రద్దయినట్లు తెలిసింది



ఎన్నికల నిర్వహణ విషయమై హైకోర్టు విధించిన స్టే రద్దయినట్లు తెలిసింది. కరోనా కారణంగా గత రెండేళ్లలో ఈ విషయంపై దృష్టి సారించలేదు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడతాం.

– అబ్దుల్‌కదీర్‌సాబ్, ఏపీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్